నేడు ఆశవర్కర్ల ధర్నా

నార్సింగి పీహెచ్ఎస్‌లో వినతిపత్ర అందజేస్తున్న ఆశవర్కర్లు

మణికొండ, జనవరి 9: ఆశవర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గండిపేట మండల సీఐటీయూ కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో నార్సింగి పీహెచ్ఎస్‌లో ఆశ వర్కర్స్ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశవర్కర్ల సమస్యలపై శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నివాసంతో పాటు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. శుక్రవారం జరిగే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, ఇంటి వద్ద జరిగే ధర్నాలో ఆశవర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని, ఆశలను పర్మినెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు.

సర్వే సమగ్రంగా చేపట్టాలి

ఇందిరమ్మ ఇండ్ల సర్వే సమగ్రంగా చేపట్టాలని జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా పేర్కొన్నారు. గురువారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. అర్హులకు లబ్ది చేకూరేలా ప్రతి ఇంటికి వెళ్ళి సమగ్ర వివరాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో యూసీడీ డీపీఓ వెంకట కిషన్ రావు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.
– జూబ్లీహిల్స్,జనవరి 9

ట్రేడ్ లైసెన్స్‌లపై బల్దియా నజర్..!

లైసెన్స్ లేనివారిని గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్..

జూబ్లీహిల్స్,జనవరి 9: జీహెచ్ఎంసీ అనుమతితో నిర్వహించాల్సిన ప్రతి వ్యాపారానికి సంబంధించిన ట్రేడ్ లైసెన్స్‌లపై బల్దియా దృష్టి సారించింది. యూసుఫ్‌గూడ సర్కిల్ పరిధిలో వ్యాపార, వాణిజ్య సంస్థల ట్రేడ్ లైసెన్సుల రెన్యువల్‌తో పాటు కొత్త వాటిని గుర్తించేందుకు కార్యాచరణ ప్రారంభించారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్‌లో జనవరి 1 నుంచి ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్‌కు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 4 విభాగాలలో 4922 మందికి పైగా వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్సులు క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుంది. అయితే కొత్తగా వ్యాపారాలు ప్రారంభించి లైసెన్స్ లేకుండా వ్యాపారాలను కొనసాగిస్తున్న వారిని గుర్తించి ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ జారీ చేస్తున్నారు. దీంతో పాటు లైసెన్స్ రెన్యువల్ చేసుకోకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్న వారికి వెంటనే లైసెన్స్‌లను క్రమబద్ధీకరిస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలుకు డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ జాకియా సుల్తానా ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహ్మత్ నగర్, ఎర్రగడ్డ, బోరబండ డివిజన్‌లలో శానిటేషన్ విభాగం అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ఆయా బృందాలతో కలిసి ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ ఫీజులు వసూలు చేసేందుకు సంబంధిత అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు కొనసాగిస్తున్న వారికి నోటీసులు జారీ చేయనున్నారు.

స్పాట్‌లో కొత్త లైసెన్స్‌లు ఇవ్వడంతో పాటు రెన్యువల్ లైసెన్సులకు అప్పటికప్పుడు సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ సాల్మన్ హెచ్చరించారు.ట్రేడ్ లైసెన్స్‌ల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే చేపడుతున్నందున వ్యాపారులు గడువు ముగియగానే రెన్యువల్ చేసుకోవాలని జీహెచ్ఎంసీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ కోరారు.

యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఆన్‌లైన్ ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ అందజేస్తున్న జీహెచ్ఎంసీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్

ఒకరిద్దరు పార్టీ మారినా..

బీఆర్ఎస్‌కు నష్టంలేదు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొమ్మ గోపాల్

శంషాబాద్ రూరల్, జనవరి 9 : ఒకరిద్దరు పార్టీ మారినా బీఆర్ఎస్‌కు ఎలాంటి నష్టం లేదని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కొమ్మ గోపాల్ తెలిపారు. గురువారం మండలంలోని చౌదర్‌గూడ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకరిద్దరు పార్టీ మారితే బీఆర్ఎస్‌కు ఎలాంటి నష్టంలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాని ఏడాది కాంగ్రెస్ పాలనలో ఒక సంక్షేమ పథకం అందలేదన్నారు. కాని గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పార్టీ మారి 200 మంది మారిన్నట్లు ప్రచారం చేసుకోవడం మంచిపద్ధతి కాదన్నారు. అధికారం ఎక్కడ ఉంటే వారు ఆ పార్టీలోకి వెళ్తారని విమర్శించారు. సమావేశంలో పార్టీ నాయకులు బుక్క సుధాకర్, బక్క ప్రశాంత్, రాము, కుమార్, అశోక్, శ్రీనివాస్, రాజు, సంతోష్ పాల్గొనారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

నారాయణగూడలోని తాజ్ మహల్ హోటల్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అవంతి విద్యాసంస్థల అధినేత శ్రీనివాసరావు

హిమాయత్‌నగర్,జనవరి 9: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించే దిశగా చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఓయూ కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం హెడ్ ప్రొఫెసర్ పీవీ.సుధా,అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాస రావు సూచించారు. గురువారం నారాయణగూడలోని తాజ్ మభల్ హోటల్‌లో అవంతి కాలేజీ లో చదువుతున్న ఎంబీఏ,ఎంసీఏ విద్యార్థుల ఆరంభం పేరిట ఫ్రెషర్స్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమైందని, విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇతరత్ర మాధ్యమాలతో సమయాన్ని వృథా చేయకుండా లక్ష్య సాధన కోసం ముందడగు వేసి విద్యపై మక్కువ పెంచుకోవాలన్నారు.సోషల్ మీడియాలో ఎడాపెడా ఫొటోలు పోస్ట్ చేయడం,సమాచారం పంపించడం వల్ల దాని ఆసరాగా చేసుకుని కొందరు ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తుంటారని అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సమాజంలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొని మంచి కలలు కని,వాటిని సాకారం చేసుకునేందుకు ప్రతి విద్యార్థి ప్రయత్నం చేయాలని సూచించారు.విద్యార్థులు చేసిన జానపద నృత్యాలు,ర్యాంప్ వాక్,ఫ్యాషన్‌షో, శాస్త్రీయ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎఫ్ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్,ఈ టాక్స్ మెంటర్ డైరెక్టర్ నాగరాజు,ప్రతినిధి పవన్‌కుమార్,అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజీ అధ్యక్షుడు ఎం.జ్ఞానేశ్వరి,ఉపాధ్యక్షుడు నందీష్,డైరెక్టర్ డాక్టర్ వై.జయప్రద,ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అప్పారావు,కార్యదర్శి సాయిరాం పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్

మైలార్‌దేవ్‌పల్లి,జనవరి 9: అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివేకానంద జయంతిని పురస్కరించుకొని అనిమియా ముక్తు భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత వికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంతంలో ఉన్న త్రిశక్తి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ప్రయోజకులుగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో త్రిశక్తి శాఖ రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు కె.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పి.మహేశ్వర్‌రెడ్డి, కోశాధికారి వి.శ్రీధర్, ఎన్వీరాన్‌మెంట్ కన్వీనర్ సతీష్‌కుమార్, మోటివేషనల్ స్పీకర్ డి.శ్రీధ ర్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రజియాబేగం, రోజారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం

శంషాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, సూపరింటెండెంట్ మైలారం దుర్గలత తదితరులు

శంషాబాద్ రూరల్, జనవరి 9 : శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో డయాలసిస్ సెంటర్‌ను గురువారం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ మైలారం దుర్గలత,మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, రాష్ట్ర నాయకుడు గణేష్‌గుప్త, మైలారం సులోచన, కౌన్సిలర్లు రేఖగుప్త, సంజెయ్ యాదవ్, అజెయ్ పలువురు వైద్యులు, నాయకులు పాల్గొన్నారు.

జీవనశైలిని అనుసరిస్తే పీసీఓడీకి అడ్డుకట్ట

హిమాయత్‌నగర్,జనవరి 9: ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడంతోనే పీసీఓడీని అరికట్టే ఆస్కారం ఉంటుందని శ్రీసత్యసాయి సేవా సమితి ప్రతినిధి డాక్టర్ సరస్వతి తెలిపారు. గురువారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థినీలు, మహిళలో ఏర్పడే పీసీఓడీ సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంక్ ఫుడ్ తీసుకోకుండా మంచి ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం వల్ల ఈ సమస్యను నివారించవచ్చని సూచించారు. అనంతరం సరస్వతిని మహిళా అధ్యాపకురాలు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ కుమార్, ప్రతినిధులు మధుసూదన్ రావు,ఎంఎల్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సరస్వతిని సత్కరిస్తున్న మహిళా ఉపాధ్యాయులు

ప్రభుత్వ బడిలో..ముగ్గుల పోటీలు

నేతాజీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 9: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని నేతాజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలను నిర్వహించారు. నవ యువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు సృజనాత్మకతంగా ముగ్గులు వేశారు. ఇందులో మొదటి బహుమతి మనిషా, ద్వితీయ బహుమతి హర్షిత, మూడవ బహుమతి జ్యోతిలు, ప్రోత్సాహక బహుమతులు అనుకుమారి, భారతి, కుమారి, వరలక్ష్మి, తనియాలు గెలుపొందారు. శుక్రవారం జరిగే కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో కిశోర్‌రెడ్డి, శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.బాలకృష్ణ, జి. మమత, మహేశ్వర్, ఎస్.లక్ష్మి, పి.యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మనుషుల అక్రమ రవాణాపై ఓరియంటేషన్

ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, రంగారెడ్డి రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో శివరాంపల్లి జడ్పీఎస్ఎస్ శివరాంపల్లి మీటింగ్ హాల్‌లో మనుషుల అక్రమ రవాణా నిర్మూలనపై గురువారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఓరియంటేషన్ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ కిషన్, ప్రజ్వల సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ, స్టేట్ కో ఆర్డినేటర్ సురేష్ కుమార్, సిబ్బంది అంబర్‌సింగ్, మితాళి రాజ్ తదితరులు పాల్గొన్నారు. – బండ్లగూడ, జనవరి 9

ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 9: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు ఏడు, ఎనిమిది, తొమ్మిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

దివ్యాంగులకు రూ. 10వేల పెన్షన్ ఇవ్వాలి

చిక్కడపల్లి, జనవరి 9: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్(డీఎస్‌డీ) అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం సంఘం కార్యాలయంలో ఉపాధ్యక్షులు భారతి, కాటమోని వెంకటేశ్ గౌడ్‌తో కలిసి మాట్లాడారు.

బీజేపీ ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా ఆదర్శ్ వంశీకర్

ఖైరతాబాద్, జనవరి 9: బీజేపీ ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా ఎ. ఆదర్శ్ వంశీకర్ నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రా రెడ్డి, నగర అధ్యక్షులు గౌతమ్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 9: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల ఎంఈ, ఎంటెక్ కోర్సుల రెండో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి, మూడో సెమిస్టర్ మేకప్ పరీక్షలను ఈనెల 18 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

డిగ్రీ కోర్సుల పరీక్షల ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీబీఏ, బీకామ్, బీఎస్సీ తదితర కోర్సు ల మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

యూజీసీ నూతన డ్రాఫ్ట్ ప్రతుల దహనం

ఉస్మానియా యూనివర్సిటీ: దేశవ్యాప్తంగా వర్సిటీల్లో అధ్యాపకుల నియామకం, ప్రమోషన్లు, వీసీ నియామ కం కోసం అర్హతలు, నిబంధనలను మారుస్తూ యూజీసీ విడుదల చేసిన నూతన డ్రాఫ్ట్ ప్రతులను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎల్ మూర్తి గురువారం మాట్లాడుతూ ఉన్నత విద్య లో ప్రమాణాల నిర్వహణ కోసం ప్రతిఒక్కరూ ఆ నిబంధనలు తిరస్కరించాలని కోరారు. నూతన ప్రతిపాదిత నిబంధనల ప్రకారం 55 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసిన వారు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు.

ప్రతి విద్యార్థికి సాగుపై అవగాహన అవసరం

రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని అల్వాల్‌లోని లయోలో అకాడమీ విద్యార్థులు గురువారం ఎంఎస్సీ బయోటెక్నాలజీ చదువుతున్న దాదాపు 35 మంది విద్యార్థులు అసోసియేట్ ప్రొ.డా హెడ్ శిలిష , అసిస్టెంట్ ప్రొఫెసర్ గురుదేవి, డా. కె పద్మలత ఆధ్వర్యంలో వర్సిటీ పరిధిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీ, హార్టికల్చర్ గార్డెన్, పరిపాలన భవనంలోని అగ్రిఇన్నోహబ్‌ను సందర్శించారు. అంతకు ముందు రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ , భారతీయ నూనెగింజల కేంద్రాలను సందర్శించారు. పలు అంశాలపై అవగాహన పెంచేందుకు ఈ పర్యటనకు వచ్చామని నిర్వాహకులు తెలిపారు.
– వ్యవసాయ యూనివర్సిటీ

అనంత పద్మనాభ స్వామి దేవాలయ స్థలంలో పోలీసుల బందోబస్తు ఆధ్వర్యంలో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం

దేవాదాయ భూమిలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 9: అనంత పద్మనాభ స్వామి దేవాలయం స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిని గురువారం అధికారులు కూల్చివేశారు. పోలీసుల భారీ బందోబస్తు మధ్య ఈ కూల్చివేతలు కొనసాగాయి. రంగారెడ్డి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, అదనపు కమిషనర్ జ్యోతి, అత్తాపూర్ పద్మనాభ స్వామి దేవాలయ ఈవో శ్రీనివాస్ పర్యవేక్షణలో అక్రమ కట్టడాలను తొలగించి నాలుగున్నర ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ జనప్రియ ప్రాంతంలోని సర్వే నెంబర్ 435, 446లో అనంత పద్మనాభ స్వామి ఆలయానికి సంబంధించిన భూమి ఉంది. కొందరు అక్రమార్కులు ఈ స్థలంపై కన్నేసి మొత్తం ఆక్రమించి షెడ్లు వేసి వ్యాపారం చేసుకుంటున్నారు.

కోర్టు ఆదేశాలతో అధికారులు జేసీబీల సహాయంతో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారులు మాట్లాడుతూ దేవాలయాల భూముల్లో చేపట్టిన నిర్మాణాలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేశామన్నారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో వాటిని ఒకొక్కటిగా కూల్చివేస్తున్నామన్నారు.

మహవీర్ కళాశాలలో ట్రెడిషనల్ డే

విద్యార్థులు చదువుతో పాటు భారత కళలను కూడా నేర్చుకోవడం ద్వారా తమ సృజనాత్మకత శక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడుతుందని మహవీర్ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మహవీర్ డిగ్రీ కళాశాలలో గురువారం ట్రెడిషనల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. అనంతరం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని రంగురంగుల రంగోళి ముగ్గులు వేశారు. ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేశారు. – మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 9:

ఎల్లారెడ్డిగూడలో..

ఆటో చోరీ

వెంగళరావునగర్, జనవరి 9 :ఇంటి వద్ద పార్క్ చేసిన ఆటో చోరీకి గురైన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఎల్లారెడ్డిగూడలోని ఆర్బీఐ క్వార్టర్స్ సమీపంలో జి.లక్ష్మీ తులసి (40) అనే మహిళ ఫుడ్ క్యాటరింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. యథావిధిగా ఫుడ్ క్యాటరింగ్ కోసం ఉపయోగించే తమ ట్రాలీ ఆటోని ఈ నెల 6న రాత్రి ఇంటి ముందు పార్క్ చేశారు. మరుసటి రోజు ఉదయం ఇంటి ముందు పార్క్ చేసిన ఆటో కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో లక్ష్మీతులసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

అచల (ఫైల్)

ఎర్రగడ్డ, జనవరి 9: విధులకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన బోరబండ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోరబండ వినాయకరావునగర్‌కు చెందిన 23 ఏండ్ల ఎల్.అచల ఓ కాల్ సెంటర్‌లో పని చేస్తున్నది. బుధవారం యధావిధిగా డ్యూటీకి వెళ్లిన అచల తిరిగి ఇంటికి చేరుకోలేదు. చాలా చోట్ల వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవటంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి ఆత్మహత్య

ఎర్రగడ్డ, జనవరి 9: టెన్త్ విద్యార్థి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన బోరబండ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఎస్పీఆర్ హిల్స్ వినాయక్‌నగర్ బస్తీకి చెందిన భూమయ్యగౌడ్ కుమారుడు శ్రావణ్‌కుమార్(15) పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం రాత్రి తన గదిలోనే చదువుకుంటున్న శ్రావణ్ గురువారం ఉదయం ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతున్నట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. చదువు వత్తిడి తట్టుకోలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు శ్రావణ్ సూసైడ్ నోట్ రాశాడని.. భూమయ్య గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.